# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

పత్రికా ప్రకటన

మే 4, 2012

## ప్రతిపాదిత ఫాసిస్టు ఎన్.సి.టి.సి.కి, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ప్రభుత్వ సాయుధ బలగాలు ప్రజలపై సాగిస్తున్న బర్బర దాడులకు, బస్తర్‌లో భారత సైన్యం మోహరింపుకు వ్యతిరేకంగా...

# మే 16న 'భారత్ బంద్'ను విజయవంతం చేయండి!

గత రెండున్నర సంవత్సరాలుగా 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో దేశ ప్రజలపై, ప్రత్యేకించి ఆదివాసులపై అత్యంత అమానుష దాడి కొనసాగుతున్నది. 'ఎన్‌కౌంటర్' హత్యలు, సామూహిక హత్యలు, లైంగిక అత్యాచారాలు, చిత్రహింసలు, గృహ దహనాలు, పంటల విధ్వంసం, లూటీలు, అరెస్టులు, 'మాయం' చేయడం... తదితర రూపాల్లో పోలీసు, పారామిలిటరీ బలగాలు ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. గత రెండున్నర ఏళ్లలో ఒక్క దండకారణ్యంలోనే 250 మందికి పైగా ఆదివాసులను హత్య చేశాయి. దేశంలో, ప్రధానంగా మధ్య, తూర్పు భాగాల్లో సాగుతున్న మావోయిస్టు వుద్యమాన్ని సమూలంగా నిర్మూలించడం ఈ దాడి లక్ష్యం.

అపార ఖనిజ, వన, జల సంపదలకు నిలయమైన మన ప్రియమైన దేశాన్ని నిట్టనిలువుగా దోచుకోవడానికి దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లు, సామ్రాజ్యవాదులు పోటీ పడుతున్నారు. ప్రత్యేకించి 2008 నుండి ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో మన దేశం వంటి వెనుకబడిన దేశాల్లోని సహజ సంపదలను, శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టడానికి ఎన్నెన్నో కుట్రలకు పాల్పడుతున్నారు. ఇక్కడి దళారీ ప్రభుత్వాలతో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఎం.వో.యు.లు కుదుర్చుకొని, జల్-జంగల్-జమీన్‌ను నాశనం చేసి ప్రజలను పెద్ద ఎత్తున నిర్వాసితుల్ని చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. పోరాడే ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వం వహిస్తున్నది. అండగా నిలుస్తున్నది. అందుకే మావోయిస్టు వుద్యమం దోపిడీ పాలకవర్గాలకు, వాళ్ల ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న సోనియా-మన్మోహన్ సింగ్-చిదంబరం-ప్రణబ్ ముఖర్జీ-జయరాం రమేష్ పాలక ముఠాకు అతి పెద్ద అడ్డంకిగా మారింది. అయితే ప్రజలను మోసం చేయడానికి వాళ్లు దీన్ని 'దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదం'గా ప్రచారం చేస్తున్నారు.

పాలకవర్గాలు తమ సామ్రాజ్యవాద అనుకూల నయా వుదారవాద విధానాలలో భాగంగా అమలు చేస్తున్న వినాశకర ప్రాజెక్టులన్నిటినీ 'అభివృద్ధి'గా ప్రచారం చేసుకుంటూ దీన్ని వ్యతిరేకించే వాళ్లందరినీ అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా మావోయిస్టులను అభివృద్ధి నిరోధకులుగా, హింసావాదులుగా, టెర్రరిస్టులుగా చిత్రీకరించి తమ కార్పొరేట్ మీడియా సాయంతో పెద్ద ఎత్తున ప్రచార యుద్ధం సాగిస్తున్నారు. మావోయిస్టు వుద్యమ ప్రాంతాల్లో, ప్రత్యేకించి దండకారణ్యంలో ప్రజలు వర్గ పోరాటం ద్వారా స్థానిక భూస్వామ్య, రియాక్షనరీ శక్తుల అధికారాన్ని దెబ్బతీసి ప్రాథమిక స్థాయిలో ప్రజల ప్రజాస్వామిక అధికార అంగాలను ఏర్పర్చుకోవడం, దాని నాయకత్వంలో స్వావలంబన, సహకారం ఆధారంగా నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా పాలక వర్గాలను తీవ్రంగా కలవరపరుస్తున్నది. అందుకే అవి దాన్ని నామరూపాలు లేకుండా చేయాలని ఈ దాడికి పూనుకున్నాయి. సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు ఈ దాడికి మార్గదర్శకత్వం వహించడమే కాదు, పరోక్షంగానో, ప్రత్యక్షంగానో పాలు పంచుకుంటున్నారు కూడా. ప్రతిపాదిత ఎన్.సి.టి.సి. వెనుక వున్నది కూడా అమెరికా సామ్రాజ్యవాదులే. ఇది దేశ పౌరుల ప్రాథమిక హక్కుల పైనే కాదు, ఫెడరల్ వ్యవస్థగా చెప్పబడే దానిపై కూడా దాడి.

ఈ దాడిలో భాగంగా సంవత్సరం కింద బస్తర్‌లో భారత సైన్యాన్ని దించారు. ఇది బస్తర్‌కు లేదా దండకారణ్యానికి మాత్రమే పరిమితం కాదు. దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని అణచివెయ్యడం కోసమే ఈ మోహరింపు. అయితే శత్రు దేశాలతో యుద్ధాల కోసం రూపొందిన సైన్యాన్ని దేశ ప్రజలకు వ్యతిరేకంగా ఉపయోగించడంపై వచ్చే నిరసనను, ప్రతిఘటనను దృష్టిలో పెట్టుకొని 'శిక్షణ' అనే సాకుతో సైన్యాన్ని మోహరిస్తున్నారు. 'శిక్షణ' కోసం మాడ్ ప్రాంతంలో 750 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని సైన్యానికి ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆదివాసీ ప్రాంతాల్లో భూముల బదలాయింపుపై వున్న నిషేధాన్ని, 5వ షెడ్యూలు, పెసా తదితర చట్టాలను ప్రభుత్వాలే స్వయంగా ఎలా వుల్లంఘిస్తున్నాయో అనడానికి ఇదొక వుదాహరణ. ప్రస్తుతం కొండగాం-నారాయణపూర్ మధ్య 'శిక్షణ' పొందుతున్న సైన్యం క్రమంగా నారాయణపూర్‌ను దాటేసి మాడ్ లోతట్టు గ్రామాల్ని కబళించే యోచనలో వున్నది. అత్యున్నత సైనికాధికారులు ఈ 'శిక్షణా' కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా గత సంవత్సర కాలంగా బ్రిగేడ్ స్థాయిలో సాయుధ బలగాలను సమీకరించి సైనిక తరహాలో దాడులకు

పాల్పడుతున్నారు. ఈ భారీ దాడుల్లో 3 వేల నుండి 5 వేల దాకా వివిధ ప్రభుత్వ సాయుధ బలగాలను, కమాండోలను వినియోగిస్తున్నారు. అక్టోబర్ 2011లో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ధనోర తాలూకాలోని గ్యారపత్తి, మాలెవాడ పోలీసు స్టేషన్ల పరిధిలో ఐదు వేల సంఖ్యలో సి.ఆర్.పి.ఎఫ్.–కోబ్రా, సి–60 కమాండో, స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు. ఈ భారీ సైనిక ఆపరేషన్‌లో 19 గ్రామాలపై దాడులు చేసి 12 మంది ప్రజలను అరెస్టు చేశారు. చాలా మందిని కొట్టారు. ఇండ్లల్లో దూరి దోపిడీకి పాల్పడ్డారు.

2011 నవంబర్ 24 నుండి 27 వరకు బీజాపూర్ ప్రాంతంలోని 16 గ్రామాలను కవర్ చేస్తూ 35 కిలోమీటర్ల పొడవున దాదాపు వెయ్యి మంది ప్రభుత్వ సాయుధ బలగాలు అనేక చోట్లలో ఆంబుష్‌లు ఏర్పాటు చేశాయి. ఇలా వాళ్లు ముఖ్యమైన నాయకత్వ కామ్రేడ్స్‌ను హత్య చేయాలని విఫల ప్రయత్నం చేశారు.

2011 డిసెంబర్ 19న దంతెవాడ జిల్లాలోని చిన్న కేడ్‌వాల్, పెద్ద కేడ్‌వాల్ గ్రామాలపై హెలికాప్టర్ల ద్వారా ఒక భారీ దాడిని నిర్వహించారు. ఏక కాలంలో పోలెంపల్లి, కిష్టారం, బెజ్జి పోలీసు క్యాంపుల నుండి దాదాపు 15 హెలికాప్టర్లలో అనేక ట్రిప్‌లలో బలగాల్ని దించారు. అదే సమయంలో కింది నుండి కూడా బలగాలు మూడు వైపుల నుండి అక్కడికి చేరుకున్నాయి. ఈ రెండు గ్రామాల్లో దాడులు చేసి కొన్ని ఇండ్లను పూర్తిగా ధ్వంసం చేసి మొత్తం 12 మందిని అరెస్టు చేశారు. చాలా ఇండ్లలో నుండి వేల రూపాయల నగదు డబ్బుతో సహా అనేక విలువైన సామాన్లు దోచుకెళ్లారు. ఒక మహిళపై అత్యాచారానికి ప్రయత్నించారు.

2012 ఫిబ్రవరి 27 నుండి మార్చ్ 1 వరకు బీజాపూర్ జిల్లాలోని గంగులూరు ఏరియాలో ప్రభుత్వ సాయుధ బలగాలు దాదాపు 2 వేల సంఖ్యతో బయలుదేరి ఒక భారీ ఆపరేషన్ నిర్వహించారు. దీనికి డి.ఐ.జి. ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. ఎడ్సుం, ఇర్మగొండ, మద్దుం, కావడ్ గ్రామాలను లక్ష్యంగా చేసుకొని సాగించిన ఈ దాడిలో మొత్తం 13 మందిని అరెస్టు చేశారు.

2012 మార్చ్ మొదటి, రెండో వారాల్లో మాడ్ ప్రాంతాన్ని మూడు వైపుల నుండి – ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, నారాయణ్‌పూర్ జిల్లాల నుండి, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుండి ఒకేసారి చుట్టుముట్టి 3 వేల మందితో ఒక భారీ ఆపరేషన్ నిర్వహించారు. దీనికి 'ఆపరేషన్ విజయ్', 'ఆపరేషన్ హాకా' అనే పేర్లు పెట్టారు. అనేక మంది ఐ.పి.ఎస్. అధికారులు ఈ ఆపరేషన్‌కు ప్రత్యక్ష నాయకత్వం వహించారు. సి.ఆర్.పి.ఎఫ్. డి.జి. విజయ్‌కుమార్ సహా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర డి.జి.పి.లు దీనికి పథక రచన చేశారు. దాదాపు పాతిక గ్రామాలపై లూటీకి, విధ్వంసానికి పాల్పడ్డ ఈ దాడుల్లో తోకె గ్రామానికి చెందిన దుంగ ధుర్వ అనే ఆదివాసీని సాయుధ బలగాలు హత్య చేశాయి. గొడ్డెల్‌మర్క గ్రామ యువకుడు లాల్సును ఎత్తుకెళ్లి 'మాయం' చేశారు. ఇండ్లలోంచి వేలాది రూపాయల నగదుతో సహా అనేక విలువైన సామాన్లు ఎత్తుకెళ్లారు.

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ జైళ్లల్లో దండకారణ్యానికి చెందిన మూడు వేలకు పైగా ఆదివాసులున్నారు. వీళ్లంతా తప్పుడు కేసుల్లో ఇరికించబడి ఎలాంటి విచారణ, జమానత్ లేకుండా ఏళ్ల తరబడి చీకటి కొట్టాల్లో మగ్గుతున్నారు. వీళ్లలో చాలా మంది పరిస్థితి ఏమిటంటే, వాళ్లపై పెట్టిన కేసులను విచారించి శిక్ష వేసినా ఈపాటికి శిక్ష పూర్తయి విడుదలయ్యే వాళ్లే. పేదరికం, వెనుకబాటుతనం మూలంగా వీళ్లలో చాలా మంది వకీళ్లను కూడా పెట్టుకోగలిగే పరిస్థితిలో లేరు. కుటుంబ సభ్యులు జైళ్లకు వెళ్లి ములాకాత్‌లు చేయలేని పరిస్థితి మూలంగా ఎందరో ఆదివాసులు మానసికంగా కూడా కుంగిపోతున్నారు. ఇది ఒక్క దండకారణ్యం పరిస్థితే కాదు, ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలది కూడా ఇదే. **ఒక్క మాటలో చెప్పాలంటే ఆదివాసుల కాళ్ల కింది నేలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కోసం దేశంలోని జైళ్లన్నీ ఆదివాసులతో నింపేస్తున్నారు.**

**ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా!**

దేశ ప్రజలపై సాగుతున్న ప్రభుత్వ ఫాసిస్టు దాడులను ఆపాలని, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా బస్తర్ ప్రాంతంలో సాగుతున్న సైన్యం మోహరింపును నిలిపివెయ్యాలని, 'శిక్షణ' పేరుతో తిష్ట వేసిన సైనిక బలగాలను వాపస్ పంపించాలని, వివిధ జైళ్లల్లో వున్న ఆదివాసులను, రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని, ప్రతిపాదిత ఎన్.సి.టి.సి.ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 16న 24 గంటల 'భారత్ బంద్'ను నిర్వహించాలని మా పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ బంద్ ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలతో పాటు మహారాష్ట్రలోని గోందియా, చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాల్లో జరుగుతుంది. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ దేశ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నది. అయితే వైద్య సేవలు, విద్యార్థుల పరీక్షలు వంటి అత్యవసర సర్వీసులను ఈ బంద్ నుండి మినహాయిస్తున్నాం.

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**